ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 5 జనవరి 2025 | 5



నువ్వే మా గేమ్ చేంజర్ : బాబాయ్ పవన్‌ను హత్తుకున్న రామ్‌చరణ్

గేమ్ చేంజర్ షో

డిప్యూటీ సీఎం పవన్.. మెగా హీరో రామ్‌చరణ్.. దర్శకుడు శంకర్ ఇలా అతిరథ మహారథులందరూ వస్తుంటే.. అభిమానం ఊరుకుంటుందా.. ఎగసిపడింది.. ఉవ్వెత్తున ఉరకలేసింది.. తమ అభిమాన నటీనటులను నేరుగా చూడాలని ఎక్కడెక్కడి నుంచో తరలిరావ డంతో వేమగిరి జనసంద్రమైంది.. ఇసుకేసినా రాలనంత జనం.. ఎక్కడి నుంచి వచ్చారో కానీ శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచే జాతీయ రహదారి యువతతో నిండిపోయింది.. సాయంత్రం ఐదు గంటలయ్యే సరికి కిక్కిరిసిపోయింది.. అభిమానులను అదుపుచేయడం ఎవరితరం కాలేదు..వీవీఐపీ.. వీఐపీ పాస్‌లు పనిచేయలేదు.. అయినా అభిమానులు కదల్లేదు.. జై పవన్.. జై రామ్‌చరణ్ అంటూ ముందుకు కదిలారు..గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను విజయవంతం చేశారు. - వివరాలు 6లో



వేదికపై మాట్లాడుతున్న పవన్ చిత్రంలో శంకర్, సూర్య, దిల్ రాజు



స్టేజిపై యాంకరింగ్ చేస్తున్న అంజలి, సుమ



అభిమాన దండ...



మాట్లాడుతున్న దర్శకుడు శంకర్



అభిమాన సంద్రం : వేమగిరిలో కిక్కిరిసిన గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్రాంగణం



మధ్యాహ్నం స్టేజ్ వద్ద కిక్కిరిసిన అభిమానులు



నిడదవోలులో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదు

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

నిడదవోలులో మంత్రి దుర్గేష్

నిడదవోలు,జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం ప్రవేశ పెట్టిందన్నారు.డిజిటల్ విద్యా విధా నంలో భాగంగానే సంకల్ప్ 2025కు శ్రీకారం చుట్టిందన్నారు.పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు మానకూడదనే సదుద్దేశంతో సీఎం చంద్రబాబు,ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టిందన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యపై దృష్టి పెట్టిందన్నారు. చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ పేరున పథకం అమలు చేయడం శుభసూచకమన్నారు.అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించి.. మంత్రి,కలెక్టర్ తదితరులంతా వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, డీఈవో కె.వాసుదేవ రావు,జిల్లా ఒకేషనల్ అధికారి సుబ్రహ్మణ్యం,డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 5న కాకినాడలో జరిగే స్వర్ణోత్సవాలను విజయవంతం చేద్దామని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణకుమారి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.జయకర్,ఎ.షరీఫ్ పిలుపునిచ్చారు.రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.కాకినాడ పీఆర్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగే స్వర్ణోత్సవాల్లో 20 వేల మంది ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.విజయగౌరి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్‌రావు,కార్యదర్శులు ఎన్.రవిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సైన్స్ ఫెయిర్ ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సైన్స్ ప్రదర్శనలతో మేధస్సుకు పదును

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల్లో ఇమిడి ఉన్న మేధస్సుకు పదునుపెడతాయని, జిల్లా కలెక్టర్ ప్రశాంతి పిలుపునిచ్చారు. రూరల్ మండల పరిధి బొమ్మూరులో గల శ్రీ సత్య సాయి గురుకుల పాఠశాలలో శనివారం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన- సౌతిండియా సైన్స్ ఫెస్ట్‌ను ప్రారంభించి మాట్లాడారు. సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. మాతృభాషపై పట్టు సాధించేందుకు విద్యార్థులు కృషిచేయాలన్నారు. ఇంగ్లీషు మీడియం ఒక వారధి మాత్రమే అన్నారు.రాజమ హేంద్రవరం రూరల్, అనపర్తి ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విద్యార్థులు పోటీతత్వంతో ప్రాజెక్టులు చేయాలన్నారు. ప్రతి మండలం నుంచి మూడు ప్రదర్శనలు జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్టు డీఈవో వాసుదేవరావు తెలిపారు. మొత్తం 19 బృందాలు ప్రదర్శన ఏర్పాటు చేశాయన్నారు.అటల్ టింకరింగ్ ల్యాబ్స్ నుంచి 30 ప్రాజెక్టులు ఎంపిక చేసినట్టు తెలిపారు. మొత్తం 500 ప్రదర్శనలు ఏర్పాటు చేయగా 800 మంది భాగస్వామ్యంతో పోటీపడినట్టు తెలిపారు. వీటిలో అత్యుత్తమ వాటిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి,జిల్లా సైన్సు అధికారి జీవీఎస్ఎస్.నెహ్రూ, రూరల్ ఎంఈవో దుర్గా తులసీ దాస్, సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ శ్యామ్‌సుందర్, ప్రిన్సిపాల్ గురవయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



షిర్డీ సాయి విద్యానికేతన్‌లో ముగ్గులు...తిలకిస్తున్న ఎమ్మెల్యే, న్యాయనిర్ణేతలు తదితరులు



నాకూ వచ్చు : ముగ్గు వేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ముగ్గులోలికే!

ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి ముగ్గుల పండుగ

- ముగ్గుల పోటీకి విశేష స్పందన
- పెద్ద ఎత్తున మహిళల హాజరు
- ఆలోచింపజేసిన ముగ్గులు
- ముందే వచ్చిన సంక్రాంతి



వెల్‌కమ్ మేడమ్ : కలెక్టర్ ప్రశాంతికి జ్ఞాపిక అందజేస్తున్న షిరిడిసాయి స్కూల్ చైర్మన్ శ్రీధర్, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్



ప్రథమ బహుమతి విజేత అమ్మాజీకి నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు, బీఎం శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముందే వచ్చేసింది.. మహిళల్లో ఉత్సాహాన్ని నింపింది.ఆకాశంలో చుక్కల్లా భువిపై చుక్కలు అందంగా వెలిశాయి..ఆకట్టుకున్నాయి. రాజమహేంద్రవరం ఆల్ బ్యాంక్ కాలనీ షిరిడి సాయి విద్యానికేతన్ గ్రౌండ్స్‌లో శనివారం సంతూర్, సెల్సియా,క్రాప్‌వారి పర్‌ఫెక్ట్ సహకారంతో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి ముగ్గు వేసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ముగ్గులు మన సంస్కృతి సాంప్రదాయంలో ఒక భాగం..అటువంటి సాంప్రదాయాన్ని గౌరవించి ప్రతి ఏటా మహిళలను ప్రోత్సహించడానికి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పండగ పూట మహిళలు ఆనందం ఉండాలని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గులు పోటీలు నిర్వహిస్తుందన్నారు. 'ఆంధ్రజ్యోతి' స్ఫూర్తితో తాము నగరంలో ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.ఆంధ్రజ్యోతి ఎండీ రాధా కృష్ణ పది మందికి ఉపయోగడే కార్యక్రమాలు చేస్తారని చెప్పారు. 80 సెంటర్లలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ప్రముఖ హాస్యనటుడు భద్రం మాట్లాడుతూ ప్రతి ఏట ఈ సంప్రదాయాలను 'ఆంధ్రజ్యోతి' కొనసాగించడం చాలా సంతోషదాయకమన్నారు. 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీల విజేతల్లో ఒకరు విజయవాడలో జరిగే ఫైనల్స్‌లో పాల్గొంటారని చెప్పారు. శనివారం తూర్పు గోదావరి, కోనసీమలో ముగ్గుల పోటీలు నిర్వహి ంచామని..ఆదివారం కాకినాడలో నిర్వహి స్తామని తెలిపారు.ముగ్గుల పోటీ నిర్వహించేందుకు సహకరించిన షిరిడి సాయి చైర్మన్ టి.శ్రీధర్ డైరెక్టర్ టి.శ్రీవిద్యలకుధన్యవాదాలు తెలిపారు.ఉదయం 11 నుంచి మధ్యా హ్నం 1 గంట వరకు జరిగిన ముగ్గుల పోటీల్లో 65 మంది మహిళలు పాల్గొని అద్భుతంగా చుక్కల ముగ్గులు వేశారు. ఈ ముగ్గుల పోటీకి లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు, ఆంధ్రకేసరి యువజన సమితి ఉపాధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, రాజమండ్రి చాం బర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ కొయ్యాన కుమారి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మహిళలు పెట్టిన ముగ్గులను తిలకించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి విజే తలు వరుసగా గిరి అమ్మాజీ (రావులపాలెం), తూతిక ఆదిశ్రీ(రాజమహేంద్రవరం), పి.పావని (రాజమహేంద్రవరం)లకు నగదు బహుమతి రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అందజేశారు.10 కన్సోలేషన్,పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు గిఫ్ట్‌లను అందించారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, 'ఆంధ్రజ్యోతి' డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజరు బి.గోపాలకృష్ణ, జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు ఎస్ఎస్ఎన్.సత్యనారాయణ, కె.రాజబాబు,పాత్రికేయులు డి.రామచంద్రరావు, ఎంబీవీ సారథి, బెజవాడ శంకర్, కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





ఫస్ట్ ప్రైజ్ రావడం ఆనందంగా ఉంది..

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో నాకు ఫస్ట్ ప్రైజ్ రావడం ఆనందంగా ఉంది. పేపర్‌లో చూసి రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వచ్చా. ప్రతి ఏలా పోటీలు నిర్వహించాలి.
- గిరి అమ్మాజీ, ప్రథమ బహుమతి, రావులపాలెం



ముగ్గులకు విలువ తెచ్చింది 'ఆంధ్రజ్యోతి'

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలకు ప్రతి ఏటా హాజరవుతా. ముగ్గుల ప్రాధాన్యతను పెంచింది ఏబీఎన్- ఆంధ్రజ్యోతి మాత్రమే. చిన్న తేడాతో ఫస్ట్ ప్రైజ్ పోయింది. సెకండ్ వచ్చింది అయినా బాధలేదు.**-టి.ఆదిశ్రీ, ద్వితీయ బహుమతి ,రాజమహేంద్రవరం**



బహుమతి రావడం ఆనందంగా ఉంది..

బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది. అసలు ఊహించలేదు.ఏదో నాకు వచ్చిన ముగ్గును అందంగా వేశా. వచ్చే ఏడాది ఫస్ట్ ప్రైజ్ సాధించేందుకు ఇప్పటి నుంచే ముగ్గు నేర్చుకుంటా.
-పావని, తృతీయ బహుమతి ,రాజమహేంద్రవరం



గేమ్ చేంజర్ వచ్చేశాడు!



బాబాయ్ ఎలా చెబితే అలా : పవన్ పక్కన చేతులు కట్టుకుని నిలబడిన రామచరణ్

రాజమహేంద్రవరం/కడియం,జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ నటుడు రామ్‌చరణ్ నటించిన గేమ్‌చేంజర్ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు గోదావరి జిల్లాల నుంచే కాక,ఇతర ప్రాంతాలనుంచి అత్యధికంగా యువత తరలివచ్చారు. మహిళలు కూడా భారగా రావడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరి హైవే పక్కన బ్రహ్మాండమైన వేదిక మీద ఈవెంట్ జరిగింది. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించి యువతను ఉర్రూతలూగించింది.అంతకుమందు మధురపూడి ఎయిర్‌పోర్టులో రామ్‌చరణ్‌కు అభిమానులు ఘనస్వాగతం పలికారు. తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కూడా ప్రత్యేక విమానంలో మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడినుంచి రోడ్డు మార్గంలో సభాప్రాంగణానికి చేరుకున్నారు. సాయంత్రం 7గంటల సమయంలో పవన్, రామ్‌చరణ్ వేదిక మీదకు చేరుకున్నారు. యాంకర్ సుమ సభను ఉత్సాహపరిచారు.గోదావరి ప్రాంతాల్లో సినిమా మొదటి రోజునే చూడడానికి యువత ఇష్టపడతారని పవన్ అన్నారు.ఈ ప్రాంతంలో యువతకు ఉపాధి చూపించే విధంగా స్టూడియోలు, స్టంట్ స్కూళ్లు, ట్రైనింగ్ స్కూళ్లు పెట్టాలని నిర్మాతలకు ఆయన సూచించారు. పవన్, రామ్‌చరణ్ ఒకే వేదిక మీద ఉండ డంతో అభి మానుల ఆనందానికి అవధుల్లేవు. మధ్యాహ్నం నుంచే అభిమానులు వేదిక వద్దకు భారీగా చేరుకోవడంకనిపించింది. సాయంత్రానికి జనం తాకిడి పెరిగి పాస్‌లు ఉన్నప్పటికీ లోపలికి పంపించలేదు. సాయంత్రం నుంచి వేదికపై ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు, నృతాలతో పలువురు అలరించారు. ఆ తర్వాత సినీ పరిశ్రమకు చెందిన పలువురు మాట్లాడారు. సంగీత దర్శకుడు తమన్ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ వేదిక మీద ప్రముఖ దర్శకుడు శంకర్, ప్రముఖ నటుడు ఎస్‌జే సూర్యహీరోయిన్ అంజలి, మరో హీరో శ్రీకాంత్, దిల్‌రాజు వంటి వారితో పృథ్వీరాజు తదితరులు అనేక మంది వేదిక మీద ఉండడం అందరికీ సంతోషాన్నిచ్చింది.జిల్లాకు చెం దిన మంత్రి దుర్గేష్,ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి,ఆదిరెడ్డి వాసు,బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు హాజరయ్యారు.రాజమహేంద్ర వరం వైపు నుంచి బొమ్మూరు నుంచి ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడింది. అయినా పోలీసు బందోబస్తు ఉండడంవల్ల అంతా బాగానే జరిగింది.వేమగిరి వైపు నుంచి అధికంగా యువత తరలివచ్చా రు.ఈవెంట్ ఏర్పాట్లను చిరంజీవి రాష్ట్ర యు వత ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రవణం స్వామినాయుడు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ తదితరులు పర్యవేక్షించారు. బాబాయ్ .. అబ్బాయ్‌లకు గజమాల వేశారు.

నేషనల్ అవార్డు స్థాయిలో రామ్‌చరణ్ నటన : దిల్‌రాజు, నిర్మాత



రాష్ట్రంలో జరిగే అంశాలను గేమ్‌చేంజర్ సినిమాలో చూపించడం జరిగింది.గేమ్‌చేంజర్‌లో నేషనల్ అవార్డు వచ్చే స్థాయిలో రామ్‌చరణ్ నటన ఉంటుంది. సినిమా అందరికీ నచ్చుతుంది. కల్యాణ్‌గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. టిక్కెట్ ధరల పెంపుపై ఏపీ ప్రభుత్వానికి కూడా కృతజ్ఞతలు.

ఎదిగిన కొద్దీ ఒదిగి ఉంటాడు : శ్రీకాంత్

దర్శకుడు శంకర్ నామీద నమ్మకంతో కారెక్టర్ ఇచ్చారు. రామ్‌చరణ్‌తో నటించడం ఇది రెండో సినిమా. రామ్‌చరణ్ ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండే మనస్తత్వం. ఒక సందర్భంలో దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ గేమ్‌చేంజర్‌కు నేషనల్ అవార్డు వస్తుందని చెప్పడం నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది.



కూటమి నేతృత్వంలో సినిమా పాలసీ

పేదవారి కంటనీరు తుడవడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాజకీయాలను నడుపుతున్నారు. తెలుగు సినీచరిత్రలో తండ్రికి తగ్గ తనయుడిగా గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ అభిమానుల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్నారు. గేమ్‌చేంజర్ ఈవెంట్ గోదావరి నదీతీరాన వెలసిన రాజమహేంద్రవరంలో జరగడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్ర రాజకీయాల్లో కీలకమార్పులు తీసుకువచ్చేలా కృషి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో సినిమా పాలసీని తీసుకురావడానికి సిద్ధంగా ఉంది. దిల్‌రాజు వంటి నిర్మాతలు ఆంధ్రరాష్ట్రం వైపు కూడా దృష్టిసారించాలి.

- మంత్రి కందుల దుర్గేష్



రామ్‌చరణ్ నటన అద్భుతం..

నా 30 ఏళ్ల సినిమా చరిత్రలో 14 సినిమాలు తీశా. అన్ని సినిమాలను తెలుగులో డబ్బింగ్ చేశాం. డబ్బింగ్ అయినా.. నాపై ప్రేమ చూపారు. మీకు తిరిగి ఏదొకటి ఇవ్వాలన్న ఆలోచనతో పూర్తి తెలుగు సినిమా తీశాను. మొత్తం తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉండేలా సినిమా తీశాం. రామ్‌చరణ్ ప్రతి క్యారెక్టర్ అద్భుతంగా చేశారు. సినిమా బృందంలో పనిచేసిన అందరికీ కృతజ్ఞతలు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంచి మనసున్న వ్యక్తి. ఆయన ఒక్కరే అందరిలోను గుండెను చూసే వ్యక్తి. రాజమహేంద్రవరంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించడం ఆనందంగా ఉంది.

-సినీ దర్శకుడు శంకర్



మాట్లాడుతున్న పవన్ చిత్రంలో శ్రీకాంత్, హీరోయిన్లు..



మాట్లాడుతున్న హీరో రామ్‌చరణ్ చిత్రంలో శ్రీకాంత్, హీరోయిన్లు, తమన్



స్టేజ్ కింద కూర్చున్న పవన్, రామ్‌చరణ్, శంకర్ తదితరులు ...

ఎట్టకేలకు పయనమవుతున్న స్టెల్లా ఎల్ నౌక

- నేడు అర్ధరాత్రి కాకినాడ యాంకరేజ్‌పోర్టు నుంచి ప్రయాణం
- 26 రోజులు సముద్రంలో పయనించి పశ్చిమాఫ్రికాలో బెనిన్ దేశానికి...
- రేషన్ బియ్యం ఎగుమతి ఆరోపణలో 55రోజులపాటు కాకినాడ తీరంలోనే ఉండిపోయిన నౌక
- నౌకలో ఉన్న 1320 మెట్రిక్ టన్నుల రేషన్‌బియ్యం ప్రభుత్వ గోదాములకు తరలింపు



నేడు అర్ధరాత్రి పశ్చిమ ఆఫ్రికాకు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న స్టెల్లా ఎల్ నౌక

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు స్టెల్లా ఎల్ పనామానౌక బయలుదేరుతుంది. ఆదివారం అర్ధరాత్రి కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి బయలుదేరేందుకు సర్వం సిద్ధమైంది. ఈభారీనౌక 26రోజులపాటు సముద్రంలో పయణించి పశ్చిమాఫ్రికాలో బెనిన్ దేశంలో కొటోనౌ పోర్టుకు చేరుకుంటుంది. అంటే ఈనెల 31వ తేదీకి గమ్యం చేరుకోగలదని నౌక అధికారులు చెబుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి బయలుదేరుతున్న ఈనౌకలోకి ఎగుమతికి సిద్ధం చేసిన 52వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లోడింగ్ చేశారు. రేషన్ బియ్యం నౌకలో ఉండటంతో 55రోజులపాటు కాకినాడ సముద్ర తీరంలోనే నౌక లంగరేసుకుని ఉండిపోయింది. ఈనౌక నవంబరు 21వ తేదీన కాకినాడ తీరానికి వచ్చింది. దీనిలోకి 32,415 మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్ అయిన తర్వాత రేషన్ బియ్యం ఉన్నట్లు అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో తొలుత జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తనిఖీలు చేశారు. తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనిఖీలు నిమిత్తం వెళ్లారు. వాతావరణం అనుకూలించకపోవడంతో నౌకలోకి వెళ్లకుండా వెనుదిరిగారు. తర్వాత అధికారుల బృందం వెళ్లి తనిఖీలుచేసి 12న మూనాలు సేకరించారు. 1320 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు ప్రకటించారు. దాదాపు వారం రోజులు శ్రమించి ఆ బియ్యాన్ని దించి ఒడ్డుకు చేర్చారు. ఎగుమతికి సిద్ధంగా ఉన్న మిగిలిన 19785 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లోడింగ్ పూర్తి చేశారు. దీంతో నౌక వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవు. నౌక బయలు దేరుతుంది.

సత్యం బాలాజీపై కేసు నమోదు

సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై పౌరసరఫరాల శాఖ అధికారులు 6ఏ కేసు నమోదు చేశారు. సీఎస్‌డీటీ శ్రీనివాసరావు కాకినాడపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. సంస్థ యజమాని ప్రదీప్ అగర్వాల్, సూపర్‌వైజర్ కల్యాణపు అశోక్‌లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టెల్లా ఎల్ పనామా నౌకలో 1320 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్‌కు చెందినవే. ఈ నేపథ్యంలో కేసులు నమోదయ్యాయి.





ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, తిరు వీధులలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గోవింద నామస్మరణతో హోరెత్తిన వాడపల్లి

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- ఒక్కరోజు ఆదాయం రూ.32.99లక్షలు

ఆత్రేయపురం, జనవరి4(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తం గా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.32,99,056 లక్షలు లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. విశాఖపట్నానికి చెందిన మహిళలు కోలాట ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

రామ్‌చరణ్‌కు ఘన స్వాగతం

కోరుకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ హీరో, గ్లోబల్ స్టార్ కొణిదెల రామ్‌చరణ్‌కు మధురపూడి విమానాశ్రయం వద్ద రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన నాయకుడు తోట నవీన్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు. గేమ్‌ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు ఆయన శనివారం మధురపూడి విమానాశ్రయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పలువురు స్వాగతం పలికారు.



మధురపూడి విమానాశ్రయం వద్ద రామ్‌చరణ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, తోట పవన్‌కుమార్

ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్

- గ్రామంలో భీభత్సం
- తప్పిన ప్రమాదం



బస్సు వెనుక పరుగులు తీస్తున్న స్థానికులు

రాజవొమ్మంగి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి గ్రామంలో శనివారం ఆర్టీసీ బస్సు భీభత్సం సృష్టించింది. నర్సీపట్నం నుంచి ఏలే శ్వరం వెళుతున్న ఆర్టీసీ బస్సు రాజవొమ్మంగి గ్రామ సమీపంలోకి వచ్చే సరికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో బస్సులో ఉన్న ప్ర యాణికులు బస్సు వెళుతుండగానే బస్సు నుంచి బయటకు దూకారు. సుమారు కిలోమీటరు మేర బస్సు ముందుకు వెళ్లింది, దీం తో గ్రామస్థులు, బస్సుకోసం వేచివున్న ప్రయాణికులు దూరంగా పరుగులు తీశారు. బస్సు గ్రామంలోకి వచ్చాక డ్రైవర్ చాకచక్యంగా బస్సును 99 క్వార్టర్స్ వైపు తీశాడు.

స్థానికులు బస్సుకు బ్రేకులు ఫెయిల్ అయిన విషయం గమనించి బస్సు టైర్లకు అడ్డుగా సిమెంట్ ఇటుకలు, తదితర రాళ్లు వేశారు, బస్సువేగం తగ్గడంతో డ్రైవర్ బస్సును డ్రైవర్ చాకచక్యంగా నిలిపివేశాడు. ఈ ఆర్టీసీ బస్సు నిత్యం రిపేర్‌లోనే ఉంటుందని, శనివారం ఉదయం ఏలేశ్వరం-నర్సీపట్నం మధ్యలో ఘాట్ రోడ్డులో బస్సు నిలిచిపోయిందని ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. అత్యంత ప్రమాదకరమైన ఘాట్‌రోడ్డులో తిరిగే బస్సులను కండీషన్‌లో ఉండేలా చూడకపోవడంపై స్థానికులు, ప్రయాణికులు మండిపడుతున్నారు.

సత్రం గదులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి

- ఈవో సుబ్బారావు



శివసదన్ కాటేజీని పరిశీలిస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ఉన్న సత్రంగదులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఈవో సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం ఆయన శివసదన్ కాటేజీ, విష్ణుసదన్ కాటేజీలను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గదుల్లో ఏమైనా ఇబ్బందులు, మరమ్మతులు ఉంటే తక్షణమే పరిస్కారంకావాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి ప్రధాన రాజగోపురం చుట్టూ ముమ్మారు భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రదక్షణ గావించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్‌లు ఐ.వి.రామారావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



తిరుచ్చిపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

లక్ష్యాన్ని చేరుకున్న డొంకరాయి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం



కేక్ కట్ చేసి అభినందనలుతెలుపుకుంటున్న ఉద్యోగులు

మోతుగూడెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ఉన్న డొంకరాయి జలవిద్యుత్ కేంద్రం జల ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంది. 2024-25కి డొంకరాయి విద్యుత్ అథారిటీ అధికారులు 95.14 మిలియన్ యూనిట్లు ఉత్పత్త లక్ష్యంగా నిర్ణయించారు. ఈ టార్గెట్ 2025 మార్చి 31 పూర్తి చేయాల్సి ఉండగా నిర్దేశించిన సమయాని కంటే మూడు నెలల ముందు 2024 డిసెంబరు 26 నాటికి 95.14 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేయడంతో అనుకున్న టార్గెట్ పూర్తయిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు డొంకరాయి విద్యుత్ కేంద్రంలో సిబ్బందిని అభినంచారు. దీంతో కేక్ కట్‌చేసి ఉద్యోగస్తులు సంబరాలు చేరుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కరరావు, ఏడీఈ లు, చంద్రమోహన్, శ్రీనివాసరావు, జెన్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

వేతనదారులకు తీపి కబురు!

- ఇకపై ఉపాధి హామీ పథకం పకడ్బందీగా అమలు
- కనీస వేతనం రూ.300కి పెంపు
- బోగస్ మస్తర్లకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కమిటీలు
- వేతనదారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



పెద్దాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులకు ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. ఇకపై ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలుచేయడంతో పాటు వేతనదారుల కనీస వేతనాన్ని రూ.263 నుంచి రూ.300కి పెంచి ఇవ్వటానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఈ విభాగం బోగస్ మస్తర్లకు అడ్డుకట్టవేయడంతో పాటు పనివేళల్లో మార్పులుచేసి వేతనదారులకు గిటుబాటు వేతనం అందించేందుకు పర్యవేక్షణ చేయనుంది. ఈ విభాగానికి డ్వామాలో కీలకంగా జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులు ప్రస్తుతం నాలుగు గంటలు పాటు పనిచేస్తున్నారు. అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బంది, ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం మస్తర్లు తనిఖీ చేయాలి. ఈతరహా చర్యలతో వేతనాదారులకు సగటున మూడు వందల రూపాయల వేతనం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం అందాలంటే ఏయే పనులు ఎంత సమయంలో చేయాల్సి ఉంటుందనే అంశాలపై జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వేతన పర్యవేక్షణ విభాగం పర్యవేక్షిస్తుంది.

నిబంధనలు ఇవే..

ఉపాధి వేతనదారులకు వేతనం పెరగడానికి ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. ముందస్తుగా అంచనాలు తయారుచేయాలి. నేల స్వభావం, వేతనదారుల పనిచేయడానికి అనువుగా ఉండేలా గుర్తించాలి. జిల్లాను యూనిట్‌గా తీసుకుని పనులు కల్పించాలి. పనివేళల్లో మార్పులు చేయాలి. సాంకేతిక సహాయకులు నిత్యం పర్యవేక్షించాలి. ఏపీడీ, ఏపీవో, ఎంపీడీవోలు మస్తర్లు తనిఖీ చేయాలి. వేతనదారులు చేసే పనివేళలు, కొలతలు పారదర్శకంగా లెక్కించాలి. వేతనాలు రసీదులు కచ్చి తంగా ఇవ్వాలి. పనులు చేపట్టే ప్రదేశంలో వేతనదారులకు ప్రథమ చికిత్స కిట్లతోపాటు తాగునీరు సదుపాయం కల్పించాలి. ప్రభుత్వం అందచేస్తున్న టెంట్లు తప్పనిసరిగా పనిచేసే చోట ఏర్పాటుచేయాలి.

బోగస్ మస్తర్లకు అడ్డుకట్ట

ఉపాధి పనుల్లో ఇప్పటికే బోగస్ మస్తర్ల బాగోతం నడుస్తోంది. వేతనదారులు పనికి రాకపోయినా హాజరైనట్టు కొందరు సిబ్బంది మస్తర్లు వేసి వేతనాలు స్వాహా చేసిన సందర్భాలు ఉన్నాయి. వేతన దినాలు దుర్వినియోగం కావడంతో పాటు పనులకు హాజరైన వేతనదారులకు పూర్తిగా వేతనం అందడం లేదు. అక్రమాలు అరికట్టడానికి జిల్లాస్థాయిలో పర్యవేక్షించే విజిలెన్స్ అధికారి సమన్వయం చేస్తారు. గత వైసీపీ పాలనలో పలు అక్రమాలు జరిగాయి. దీంతో కూటమి ప్రభుత్వం అమలులోకి వచ్చిన తరువాత అనేకచోట్ల అక్రమాలపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి వారినుంచి రకవరీ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

శ్రమశక్తి సంఘాల పునరుద్ధరణ

గతంలో 20 నుంచి 30 మంది వేతనదారులతో శ్రమశక్తి సంఘాలు (ఎస్ఎస్ఎస్)గా 20 ఏర్పాటుచేసి వారికి మేట్‌లను నియమించేవారు. వారికి ఏటా శిక్షణ ఇచ్చేవారు. ఈసంఘాలు కొన్ని నిర్దిష్టమైన పనులు చేసేవి. మేట్‌లు అందరూ ఫీల్డ్ అసిస్టెంట్లకు సహాయంగా ఉండేవారు. దీంతో పథకం సజావుగా సాగేది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రమశక్తి సంఘాలను పట్టించుకోకపోవడంతో కనుమరుగయ్యాయి. ఉపాధి హామీ పథకంలో పనులు సక్రమంగా జరగకపోవడానికి వేతనదారులకు రూ.300 అందడానికి సిబ్బందితో పాటు శ్రమశక్తి సంఘాలను తిరిగి అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. మండల స్థాయి సిబ్బందికి కూడా మారుతున్న కాలాన్ని బట్టి జాబ్ చార్ట్‌పై శిక్షణ, అవగాహన కల్పించనున్నారు.

లక్ష్యానికి అనుగుణంగా పనివేళలు



జాబ్ కార్డు ఉన్నవారందరికీ దినసరి వేతనం రూ.300 అందేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వేతనదారుల పనివేళలు పెంచాలి. రోజుకు నాలుగు గంటలు పనిచేసేవారు అదంగా మరో గంట చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుంది. వేతన పెంపుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించాం.

-డి.శ్రీలలిత, ఎంపీడీవో, పెద్దాపురం

జీజీహెచ్‌లో ఆంకాలజీ ఐసీయూ ప్రారంభం



ఆంకాలజీ ఐసీయూను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ ఆంకాలజీ విభాగంలో రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డా. పేర్రాజు దినవాహి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)ను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) శనివారం ప్రారంభించారు. తొలుత మెడిసిన్ విభాగంలో డయాలసిస్ యూనిట్‌కు సంబంధించిన ఆర్వోప్లాంట్‌ను వారు ప్రారంభించారు. అనంతరం రూ.10.62 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన పాలియేటివ్ ఆంకాలజీ యూనిట్, రేడియేషన్ ఆంకాలజీ యూనిట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఆరు పడకల సామర్థ్యం కలిగిన ప్రత్యేక ఐసీయూను ఎమ్మెల్యేలు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. 2001 బ్యాచ్‌కు చెందిన ఆర్ఎంసీ పూర్వ విద్యార్థి డా.పేర్రాజు దినవాహి జ్ఞాపకార్థం ఆయన తల్లిదండ్రులు చిన హనుమంతురావ్, పద్మావతి దంపతులు, 2001 ఆర్ఎంసీ పూర్వ విద్యార్థులు కలిసి అందజేసిన నిధుల సాయంతో ఈ ఐసీయూను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గోదావరి జిల్లాల ఆరోగ్య ప్రధాయిని అయిన కాకినాడ జీజీహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసి జీజీహెచ్‌ను కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రస్తుత సమాజంలో క్యాన్సర్ మహమ్మారి ఎక్కువ మందిని పట్టి పీడిస్తుందని ఈ పరిస్థితుల్లో క్యాన్సర్ విభాగాన్ని మరింత అభివృద్ధి పర్చవల్సి ఉందని, ప్రస్తుత ఐసీయూ క్యాన్సర్ పేషెంట్లకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెంట్ డా.ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెంట్, ఆంకాలజీ హెచ్‌వోడి డా.శ్రీనివాసన్, మెడిసిన్ హెచ్‌వోడి డా.యశోదమ్మ, రామ్‌కోసా అధ్యక్షుడు డా.ఆనంద్, కార్యదర్శి డా.అరుణాదిత్య, కోశాధికారి డా.తేజోకృష్ణ, టీడీపీ నాయకులు అమన్‌జైన్, మల్లిపూడి వీరు ఉన్నారు.

కాలేజీ బస్సు ఢీకొని కార్మికుడి మృతి



మణికంఠ (ఫైల్ ఫొటో)

సర్పవరం జంక్షన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డు కోరమండల్ రహదారిలో ఓ కాలేజీ బస్సు ఢీకొని కార్మికుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాల్లో కెళితే కాకినాడ రూరల్ వలసపాకలకు చెందిన నిమ్మ మణికంఠ (22) బీచ్‌రోడ్డులో గల కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థలో కాంట్రాక్టర్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కంపెనీలో పని ముగించుకుని కర్మాగారం బయట రహదారిపైకి రాగానే అటుగా వస్తున్న ఆదిత్య కాలేజీకి చెందిన బస్సు మణికంఠను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో అస్వస్థతకు గురైన క్షతగాత్రుడ్ని మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్థారించారు. మృతుడు బంధువు ఆర్.గురుమూర్తి ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు ఏఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. త్వరలో ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లి చేసేద్దాం అనుకుంటున్న క్రమంలో కుమారుడు మణికంఠ మృతి చెందడం పట్ల తల్లిదండ్రులు, సోదరిలు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌పై కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేశారు. మృతికి కారణమైన కాలేజీ యాజమాన్యం తగిన న్యాయం చేయాలని, లేదంటే మృతదేహంతో కాలేజీ ఎదుట ఆందోళన చేస్తామని బాధితులు హెచ్చరించారు. కాలేజీ యాజమాన్యం మృతుని బంధువులతో చర్చించి, తగిన హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



ప్రత్తిపాడులో మృతిచెందిన సతీష్

ప్రత్తిపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. స్థానిక పోలీసులు అందించిన సమాచారం మేరకు రాజమహేంద్రవరం నుంచి తునికి బైక్‌పై వెళుతున్న తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన కర్రి సతీష్(25) స్థానిక నరేంద్రగిరి హై వేవద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వాహనం ఢీకొని సతీష్‌మీదుగా దూసుకుపోయింది. దీంతో శరీర భాగాలు నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

కేశనపల్లిలో ఆవుల అందాల పోటీలు



కేశనపల్లిలో జరిగిన పోటీల్లో ఆవులు

మలికిపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో రాష్ట్రస్థాయి ఒంగోలు, పుంగనూరు గిరి ఆవుల అందాల పోటీలు కొనసాగాయి. మొదటిరోజు సాయంత్రం పాల పోటీల్లో పాల్గనే ఆవుల పాలను పూర్తిగా పితికించి మరుసటి రోజు శనివారం రెండు పూటల పాలను లెక్కించారు. అదేవిధంగా పలు విభాగాల పోటీల నిర్వహించారు. పుంగనూరు ఆవులు, గిత్తలు, ఒంగోలు ఆవులు, ఒంగోలు గిత్తలు, గిరి ఆవుల పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలు మొదటిరోజు వివరాలను సేకరించారు. పలు ప్రాంతాల నుంచి ఆవుల అందాల పోటీలను తిలకించడానికి భారీగా జనం వచ్చారు. అంబాజీపేటకు చెందిన వ్యక్తి తీసుకువచ్చిన చిన్న ఎడ్ల బండికి మేకను కట్టి ఒక బాలుడు ఆవరణలో హల్‌చల్ చేశాడు. శుక్రవారం రాత్రి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ ఆవుల అందాల పోటీలను తిలకించారు.



ప్రదర్శనలో ఆవులు..



చిన్న ఎడ్ల బండిలో కూర్చుని సందడి చేస్తున్న బాలుడు

నేటి నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

తరలిరానున్న ఉపాధ్యాయులు

వేదిక పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణం

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు ప్రారంభం అవుతున్నాయి. 3రోజులపాటు ఈ సభలు జరగనున్నాయి. రాష్ట్రంలో 26జిల్లాల నుంచి వచ్చే వేలాది మంది ఉపాధ్యాయులు సభలో కుర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథులు ఆశీనులయ్యే విధంగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. భారీగా టెంట్‌లు, సభా వేదిక నిర్మించారు. సభకు హాజరైన ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా భోజనాలు, అల్పాహారాలు సమకూర్చుతున్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం నుంచి జిల్లా కార్యవర్గం అందరూ దీనిలో తలమునకలై ఉన్నారు. ఈ సభను గ్రాండ్‌సక్సెస్ చేయాలనే సంకల్పంతో ఏర్పాట్లు చేస్తున్నారు.



మహాసభలకు చేస్తున్న ఏర్పాట్లు

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



మహిళా అభ్యర్థుల పరుగు పందాన్ని పర్యవేక్షిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కాకినాడ క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థినులకు దేహదారుఢ్య పరీక్షలను కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు ఐదో రోజైన శనివారం కూడా కొనసాగాయి. ఈ పరీక్షల్లో మొత్తం 320 మంది మహిళా అభ్యర్థినులు హాజరు కాగా తదుపరి పరీక్షకు 203 మంది అభ్యర్థినులు అర్హత సాధించారు. ఈ సామర్థ్య పరీక్షలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ స్వయంగా పర్యవేక్షించారు.

జేఎన్టీయూకే ప్రొఫెసర్లపై చర్యలకు ఆదేశాలివ్వాలి

గవర్నర్‌కు సోషల్ యాక్టివిస్ట్ ఫిర్యాదు

జేఎన్టీయూకే, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకేలో జరుగుతున్న పరిపాలన, ఆర్థిక అక్రమ లావాదేవీలపై మూడో పార్టీ ప్రత్యేక ఆడిట్ నిర్వహణతోపాటు కోట్లాది రూపాయిల దుర్వినియోగానికి కారకులైన ప్రొఫెసర్లపై చర్యలకు ఆదేశాలివ్వాలని కాకినాడకు చెందిన సోషల్ యాక్టివిస్ట్ ఏపీ గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకూ ఉన్న ఉపకులపతులు, రిజిస్ట్రార్లు, డైరెక్టర్లు తమ ఇష్టారాజ్యంగా నిధులను ఖర్చుచేశారని వారిపై విచారణ చేసి రికవరీ చేయాలని కోరారు. ఆడిట్ వర్గాలు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నప్పటికీ డైరెక్టర్లకు పేషీ అలవెన్స్, కారు అలవెన్స్‌లను చెల్లిస్తున్నారన్నారు. అనుబంధ కళాశాలలు కొన్ని బకాయిపడిన ఫీజులను చెల్లించకపోయినా వాటికి అనుమతులు ఇస్తున్నారని తెలిపారు. త్వరలో భర్తీ కానున్న విశ్వవిద్యాలయ ఉపకులపతి పదవికి జేఎన్టీయూకే నుంచి చాలా మంది ప్రొఫెసర్లు పోటీపడుతున్నారని సచ్ఛీలురైన వారిని ఎంపికచేసి నియమించాలని కోరారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపకులపతి పదవిని భర్తీచేయడానికి ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ విధానంలో 14వ నిబంధన క్రింద దరఖాస్తుదారుడిపై ఉన్న కోర్టు కేసులు, విజిలెన్స్ కేసుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రతులను రాష్ట్రగవర్నర్‌తో పాటూ సీఎం నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు పంపించారు.

బాలబాలాజీకి విశేష పూజలు

రూ.1,84,745 ఆదాయం

మామిడికుదురు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జామున అర్చకులు వేద మంత్రోచ్చారణలతో స్వామివారికి తొలిహారతి ఇచ్చి సుప్రభాత సేవ నిర్వహించారు. నిత్య కల్యాణం, లక్ష్మీనారాయణ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారిని శనివారం 3289 మంది భక్తులు దర్శించుకుని, 2316మంది అన్నదాన ప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,84,745 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శృంగారవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి దర్శనానికి శనివారం తెల్లవారుజామునుంచే భక్తులు బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.73,150, అన్నదాన విరాళాలు రూ.38,813, కేశఖండన ద్వారా రూ.1,960, తులాభారం, కానుకలు ద్వారా రూ.300 లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.14,250 వెరసి రూ.1,28,743 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 4వేలమంది భక్తులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మిలీషియా కమాండర్ లొంగుబాటు



పోలీసుల ఎదుట లొంగిపోయిన మిలీషియా కమాండర్ తెల్లం బుధ్ర

చింతూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ మిలీషియా కమాండర్ తెల్లం బుధ్ర శనివారం లొంగిపోయాడు. చింతూరు ఏఎస్పీ పంకజ్ కమార్ మీనా వివరాల మేరకు.. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా చిమిలిపెంటకు చెందిన తెల్లం బుధ్ర 2010లో మావోయిస్టు పార్టీలో చేరాడు. దీంతో మిలీషియా సభ్యుడిగా మావోయిస్టు పార్టీ బాధ్యతలు అప్పగించింది. తదుపరి 2012లో మిలిషియా కమాండర్‌గా పదోన్నతి కల్పించిన పార్టీ 12 బోర్ తుపాకీ కేటాయించింది. నాటి నుంచి ఇప్పటివరకు సూర్పనగూడ మిలీషియా కమాండర్‌గా పని చేసిన బుధ్ర మావోయిస్టు పార్టీ విధానాలకు విసుగు చెంది తమ ఎదుట లొంగి పోయినట్టు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కంపెనీ 42వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.దివాకర్, సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ పిరమేష్ పాల్గొన్నారు.

'సూపర్-6 అమలులో ప్రభుత్వం వైఫల్యం'

అమలాపురం టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సూపర్-6 హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. ఎన్నో ఆశలతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తే 6నెలల్లోనే చేయాల్సిందంతా చేస్తున్నారని ధ్వజమెత్తారు. విశాఖ స్టీలు ప్లాంటును ప్రైవేటీకరణ కాకుండా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఏం ప్రయత్నాలు చేస్తున్నారో ప్రజలకు బహిరంగంగా చెప్పాలన్నారు. తొలుత అమలాపురంలోని గిడుగు స్వగృహం వద్ద నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, నియోజకవర్గ ప్రతినిధి అయితాబత్తుల సుభాషిణి, చీకట్ల అబ్బాయి, వంటెద్దు బాబి, అయితాబత్తుల కుమార్‌సింగ్ ఉన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



కార్పొరేషన్(కాకినాడ), జనవరి 4(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కాకినాడ జిల్లా నుంచి ప్రత్యేక బస్సులు తిప్పేందుకు ఆర్టీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 8 నుంచి 13వతేదీ వరకు దూర ప్రాంతాలకు బస్సులను సిద్ధం చేస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

హైదరాబాద్ రూటులో అధికంగా..

హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాలకు సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి కాకినాడ జిల్లాకు 66 బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో హైదరాబాద్ నుంచి కాకినాడ డిపోకు 34 బస్సులు, హైదరాబాద్ నుంచి పార్వతీపురం ఒక బస్సు, హైదరాబాద్ నుంచి తుని డిపోకు 18 బస్సులు, హైదరాబాద్ నుంచి ఏలేశ్వరం డిపోకు 13 బస్సులు సంక్రాంతి పండుగ సందర్భంగా తిప్పనున్నారు. డిమాండ్‌ను బట్టి బస్సుల సంఖ్య పెంచేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఇతర జిల్లాలకు కూడా బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేశారు. కాకినాడ నుంచి విశాఖపట్నం 10 బస్సులు, కాకినాడ నుంచి పలాస ఒక బస్సు, కాకినాడ నుంచి శ్రీకాకుళం మూడు బస్సులు, కాకినాడ నుంచి విజయనగరం మూడు బస్సులు కాకుండా రద్దీ బట్టి బస్సులు ఏర్పాటుచేయనున్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కందుల, ఎమ్మెల్యే గోరంట్ల.. బుర్రిలంకలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



బుర్రిలంకలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన దుర్గేష్, గోరంట్ల

కడియం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కడియం మండలం బుర్రిలంకలో జాతీయ రహదారి పక్కన కాలవ గట్టు నుంచి ఏటి గట్టు వరకు రూ.1.85 కోట్లతో నిర్మించబోయే రహదారికి మంత్రి దుర్గేష్‌తో కలిసి ఎమ్మెల్యే గోరంట్ల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని అన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గుంతలు లేని రహదారులే లక్ష్యంగా రహదారుల అభివృద్ధిని చేపడుతున్నట్టు చెప్పారు. గోరంట్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నిర్ణయాలకు అనుగుణంగా, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో ముందుకు వెళుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రమేష్, డీఈ రవి, పాటంశెట్టి రాంజీ, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, పంతం గణపతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మూరు పంచాతీ పరిధి నతాజీనగర్ ముంపు లేకుండా చేసే బాధ్యత తనదని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్థానికులకు హామీ ఇచ్చారు. నేతాజీనగర్, సెయింటిన్స్ స్కూల్ ఏరియా, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు రూ.1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

లేకుంటే రిటర్న్ గిఫ్ట్: కమిషనర్



నగరంలో రోడ్డుపై వేస్టు కప్‌లను వేసిన కాఫీ షాపులోనే తిరిగి వాటిని వేయిస్తున్న కమిషనర్ కేతన్


రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత పాటించడంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్- 2025 కార్యక్రమంలో భాగంగా నగరంలో శానిటేషన్ నిర్వహణపై పలు ప్రాంతాల్లో శనివారం తనిఖీలు చేశారు. కొత్తగా రిటర్న్ గిఫ్ట్ 2.0 పేరుతో కార్యక్రమం చేశారు. నగరంలో పర్యటించిన ఆయన కోయంబత్తూర్ కాఫి పాయింట్ వద్ద కాఫీ తాగి రోడ్డున ఫుట్‌పాత్ పై పడేసిన ఖాళీ పేపరుకప్పులను గమనించారు. వెంటనే స్పందించి అక్కడ పారిశుధ్య సిబ్బందితో ఆ కప్పులను ఈ టీపాయింట్‌లోనే పడవేయించారు. అటుపై నిర్వాహకుడికి క్లాస్ తీసుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2025 పై చైతన్యవంతం కావాలని, ప్రజలంతా సహకరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని సూచించారు. ఎవరైతే వారి ద్వారా ఉత్పన్నమయే వ్యర్థాలను ఒద్దిక చేయరో వారికి వాటినే తిరిగి గిఫ్ట్‌గా ఇస్తామని కమిషనర్ చెప్పారు. ఈ విధంగా ప్రజలను చైతన్యం చేస్తే మళ్లీ అటువంటి పరిస్థితులు ఉత్పన్నం కావన్నారు. నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. 19వ డివిజన్‌లో రైల్వేస్టేషన్ ప్రాంతంలో పర్యటించి బాబా టీస్టాల్, మమత హోటల్, ఆల్ఫా రెస్టారెంట్‌లను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆల్ఫారెస్టారెంట్, బాబా టీస్టాల్ వారికి రూ.2 వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాసరావు ఉన్నారు.

రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి

కోటిలింగాలపేటలో నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్‌ను కమిషనర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు. పనుల వివరాలను ఏఈ శ్రీధర్ వివరించారు. వేసవి వచ్చేనాటికి మంచినీటి రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మెకానికల్ ఎస్కలేటర్‌ను సందర్శించారు. డ్రైనేజీలో సిల్ట్‌ను ఎప్పటికప్పుడు బయటకు తీసి వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గౌతమి గ్రంథాలయాన్ని పరిశీలించారు. రుడా నిధులతో చేపట్టిన నిర్మాణ పనులు తనిఖీ చేశారు.

అలరించిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

అనపర్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని శారదా సంగీత కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 26వ త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిధులుగా విచ్చేసిన మేడపాటి చెల్లారెడ్డి, తేతల త్రినాదరెడ్డి, తాడి రామచంద్రారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా గ్రామానికి చెందిన కౌశిత ఆరాధ్య నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం చెన్నైకి చెందిన విద్వాన్ యూపీ రాజు, విదుషి యు నాగమణిల మాండలిన్ వాద్య కచేరీ సంగీత ప్రియులను ఆకట్టుకుంది. వాద్య కచేరీకి వాయిద్య సహకారం విద్వాన్ పారుపల్లి పల్గుణ్, మృదంగం విద్వాన్ హరిబాబు అందించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులతో బాటుగా సంగీత ప్రియులు హాజరయ్యారు. కార్యక్రమాలను సమితి అధ్యక్షుడు తమలంపూడిచిన ఆదిరెడ్డి, రఘునాదరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.



కౌశిత ఆరాధ్య నృత్య ప్రదర్శన



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ఆకట్టుకున్న సంక్రాంతి ముగ్గుల పోటీలు

• 11న పుష్కరాలరేవు వద్ద బహుమతుల ప్రదానం • ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు శనివారం నగరంలో 12, 13, 14, 15, 34 డివిజన్లలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయా డివిజన్ ఇన్‌చార్జిలు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై ముగ్గులను పరిశీలించారు. ప్రతి ఏడాది ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విజేతలకు ఈ నెల 11న పుష్కరాల రేవు వద్ద నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరించిన డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం అర్బన్,జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు శనివారం ఏపీఎన్‌హెచ్‌ఎంజేఏసీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ దయామణి, జాయింట్ సెక్రటరీ సుధీర్‌బాబు, ఏవో సత్యకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సహాయ బీసీ సంక్షేమాధికారిగా సుబ్బారావు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సహాయ బీసీ సంక్షేమాధికారి (ఏబీసీడబ్ల్యువో)గా ముత్యాల సుబ్బారావు నియమితులయ్యారు. రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ అమలాపురం ఏబీసీడబ్ల్యువోగా విధులు నిర్వరించారు. ఇక్కడ పనిచేస్తున్న పిల్లి సత్య రమేష్ డిప్యుటేషన్‌పై అమలాపురం ఏబీసీడబ్ల్యువోగా వెళ్లడంతో ఆయన స్థానంలో సుబ్బారావును డిప్యుటేషన్‌పై ఉన్నతాధికారులు ఇక్కడ నియమించారు. ఈ మేరకు సుబ్బారావు జిల్లా బీసీ సంక్షేమాధికారిణి బి.శశాంకకు జాయినింగ్ రిపోర్టు అందజేశారు.

శెట్టిబలిజ సేవా సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులో శెట్టిబలిజ సంక్షేమ సంఘం కార్యాలయంలో శనివారం శెట్టిబలిజ సేవాసమితి 2025 క్యాలెండర్‌ను సేవాసమితి వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు,అధ్యక్షుడు మట్టపర్తి సత్యనారాయణ శనివారం ఆవిష్కరించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి బత్తిన ఏడుకొండలు, సమితి కోశాధికారి బొక్కా సత్య వెంకటప్రతాప్, ఆనెం చిన్న, గుమ్మల నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

భూపతిపాలెంలో ఎడ్యుకేషనల్ హబ్



గోకవరంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

» ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

» ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

గోకవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): భూపతిపాలెం గురుకుల పాఠశాల సమీపంలో ఉన్న సుమారు 171 ఎకరాల్లో ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, దీని వల్ల ఐదో తరగతి నుంచి పీజీ వరకు ఒకేచోట విద్యను అందించనునట్టు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకాన్ని గోకవరం జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతీ ఒక్కరికీ విద్య చాలా అవసరమని, కూటమి ప్రభుత్వం విద్యా విధానంలో పెను మార్పులు తీసుకొచ్చిందన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో కళాశాలకు చెందిన ప్రతీ విద్యార్థి 85శాతంతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, ఎంపీడీవో గోవిందు, ఎంఈవో గౌరమ్మ, టీడీపీ నాయకులు మంగరౌతు రాము, అడపా భరత్, పాలూరి బోస్, దాసరి తమ్మన్నదొర, గాజింగం సత్తిబాబు, గళ్లా రాము, బత్తుల సత్తిబాబు, బది రెడ్డి బాబీ, బదిరెడ్డి అచ్చన్నదొర తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని పందలపాక జడ్పీ ప్లస్ పాఠశాలల్లోని ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఎస్ఎంసీ చైర్మన్ పంపన వీరసూర్యనారాయణ ప్రారంభించారు. 40 మంది విద్యార్థినిలు భోజనం స్వీకరించారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోణాల సత్తిరాజు, పీడీ యువరాజారెడ్డి, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బిక్కవోలు జడ్పీ ప్లస్ పాఠశాలలో 25 మంది విద్యార్థినులు మధ్యాహ్న భోజనం స్వీకరించారని హెచ్ఎం పి.వీరప్రభాకరరావు తెలిపారు.



బిక్కవోలులో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

సీతానగరం/కోరుకొండ: మండల కేంద్రాలైన సీతానగరం, కోరుకొండ గ్రామాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ప్రారంభించారు. ముందుగా విద్యార్థులకు భోజనాలు వడ్డించి, తదుపరి వారితో కలసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకాన్ని జూనియర్ కళాశాల విద్యార్థులకు అములు చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రసంశనీయమన్నారు. బీవీఆర్ చౌదరి మాట్లాడుతూ సరైన ఆహారం ఉన్నప్పుడే విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టగలుగుతారని అన్నారు. అంతకుముందు ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వలవల రాజా, తనకాల నాగేశ్వరరావు, మట్ట వెంకటేశ్వరరావు, అద్దాల శివ, మాతా సీతారాముడు, హైస్కూల్ చైర్మన్ తెలగంశెట్టి శివ, ప్రగడ జోగారావు, ముక్కా రాంబాబు, బదిరెడ్డి దొర, కంటే నాగ కేశవరావు, డాక్టర్ అడపా శ్రీనివాస్ పాల్గొన్నారు.

కడియం: మండలంలోని మురమండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ టీఎస్‌వీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నందమూరి సూరిబాబు, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వట్టికూటి జానకిరామ్, దేవళ్ల రామ్మోహనరావు, మధ్యాహ్న భోజన పథకం ఇన్‌చార్జి ఎం.విజయ్‌కుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో హిమోగ్లోబిన్ శాతం పెరగడానికి వారికి పౌష్టికాహారం అందించడం అవసరమన్నారు. గత ప్రభుత్వంలో కేంద్ర సాయంతో పెట్టిన పథకాలకు కూడా జగనన్న పథకం అంటూ ఒక ప్రహసనంగా మారిన పరిస్థితుల్లో నేడు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఒక మహత్తర మార్పుకు నాంది పలికారని, విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకొని పోటీ ప్రపంచంలో ముందుకు దూసుకుపోవాలన్నారు. కాగా కళాశాల ప్రాంగణంలోని కళావేదికకు రూ.5 లక్షలతో చేపడుతున్న రూఫ్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, టీడీపీ, బీజేపీ, జనసేన మండలాధ్యక్షులు వెలుగుబంటి సత్తిబాబు, ఎం.సాయిరాం, జి.సత్తిబాబు, నాయకుడు సత్తి దేవానందబాబా ఎంపీ డీవో సాయిబాబు, డీటీ రంజిత్‌కుమార్, ఎంఈవోలు కె.శ్రీనివాసరావు,పి. మదుసూదనరావు, హెచ్ఎం వి.పార్థసారధి, ప్రిన్సిపాల్ బి.హేమ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథ కాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. కళాశాల విద్యార్థుల కోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సీఎం చంద్రబాబు వర్తింపజేస్తున్నారని చెప్పారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

మారిన మెనూ...

బిక్కవోలు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో 1వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో మెనూ మారిందని ఈ మెనూను శనివారం నుంచి అమలు చేస్తున్నామని ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం.. అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు ఫ్రై, చిక్కీ, మంగళవారం.. పులిహోర, చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ, బుధవారం.. అన్నం, కూరగాయల కూర, గుడ్డుఫ్రై, చిక్కి, గురువారం.. విజిటబుల్ రైస్ లేదా పులావ్, బంగాళాదుంప కూర్మా, ఉడికించిన గుడ్డు, రాగిజావ, శుక్రవారం.. అన్నం, ఆకు కూర పప్పు, గుడ్డుఫ్రై, చిక్కి, శనివారం..అన్నం, కూరగాయలకూర, స్వీట్‌పొంగల్, రాగిజావ అందించాలన్నారు. మారిన మెనూను అందరు ప్రధానోపాధ్యాయలు అమలు చేయాలని ఎంఈవో పేర్కొన్నారు.



కడియంలో విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం



రాజమహేంద్రవరంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వాసు



రంగంపేటలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



సీతానగరంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

నేటి నుంచి లేపాక్షి ఎగ్జిబిషన్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గోకవరం బస్టాండ్ వద్ద గల లేపాక్షి హేండీక్రాఫ్ట్ ఎంపోరియంలో ఆదివారం నుంచి 9వరకు హస్తకళల ఎగ్జిబిషన్ జరుగుతుందని ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ తెలిపారు. కోటిపల్లి, ఏటికొప్పాక, వైట్‌వుడ్ బొమ్మలు, కలంకారీ చీరలు వస్తువులు విక్రయిస్తారన్నారు.

వేసవి నాటికి రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి

కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చేనాటికి మంచినీటి రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. రాజమహేంద్రవరం కోటిలింగాలపేటలో నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్‌ను శనివారం ఆయన పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణ పనుల వివరాలను ఏఈ శ్రీధర్ తెలిపారు. సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన మెకానికల్ ఎస్కలేటర్‌ను సందర్శించారు. డ్రైనేజీలో సిల్ట్‌ను ఎప్పటికప్పుడు బయటకు తీసి వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గౌతమి గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించారు. రుడా నిధులతో చేపట్టిన పనులు తనిఖీ చేశారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం జనవరి 4(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి-అనపర్తి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి శనివారం ఉదయం 8 గంటల సమయంలో రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. రాజమండ్రి జీఆర్‌పీ పోలీసుల వివరాల ప్రకారం..రైలు నుంచి జారిపడిన వ్యక్తి సుమారు 20-25 మధ్య వయసు ఉంటాడన్నారు. మృతుడు ఎరుపురంగు టీ షర్టు, నీలంరంగు ట్రాక్ ధరించి ఉన్నాడని మృతుడి వద్ద వివరాలు లేవన్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్టు చెప్పారు. మృతుడి వివరాలకు జీఆర్‌పీ స్టేషన్ నెంబరు 0883 2442821, ఎస్‌ఐ 9491003239 లో సంప్రదించాలని వారు తెలిపారు.

10న ఇళ్లులేని పేదలు రావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మధు పిలుపు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సొంతిళ్లు లేని పేదలు ఈ నెల 10న రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. ఈ మేరకు శనివారం గణేష్‌నగర్, పోస్టల్ కాలనీ, ఆదెమ్మదిబ్బ తదితర ప్రాంతాల్లో ఇళ్లలేని పేదలకు ఇళ్ల దరఖాస్తులను అందజేశారు. ప్రభుత్వం ఇళ్లులేని పేదలందరికీ వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు రాజమహేంద్రవరంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసి స్థలాలు చూపించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, లావణ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించండి

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అనపర్తి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాత్రి అనపర్తి మండలం రామవరంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అభివృద్ధి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.13కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని సమస్యలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అనపర్తి ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, బిక్కవోలు ఎంపీడీవో శ్రీనివాస్, పెదపూడి ఎంపీడీవో నరేంద్రరెడ్డి, రంగంపేట ఎంపీడీవో సాయిబాబు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

బిక్కవోలు: బిక్కవోలు రాతిచెరువుపేటలో శుక్రవారం రాత్రి యూత్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరిపారు. ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కేకు కట్ చేసి మహిళలకు అందించారు. ఈసందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. యూత్ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, తనుకు శ్రీధర్, గుణ్ణం రమేష్ చౌదరి, తొండాపు సత్యనారాయణరెడ్డి, పవన్ రెడ్డి, బిక్కవోలు ఎస్ఐ రవిచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

అనపర్తి: రామవరంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం పెదపూడి మండలం గొల్లల మామిడాడ ది చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి ఆవిష్కరించి వ్యాపారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి, పెద్దిరెడ్డి లక్ష్మణరావు తదితరులతో పాటు కూటమి నాయకులు శివరామారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఏకేసీ రోటరీ హాల్‌లో పాలకవర్గ సమావేశం దృశ్యం

ఆంధ్రకేసరి విద్యా సంస్థలను డీమ్డ్ వర్శిటీగా తీర్చిదిద్దుతాం

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి విద్యా సంస్థలను కేజీ నుంచి పీజీ వరకు తీర్చిదిద్ది డీమ్డ్ యూనివర్శిటీ చేయడానికి ప్రతి ఒక్క సభ్యుడు కృషి చేయాలని ఆంధ్రకేసరి యువజన అధ్యక్షుడు వి.భాస్కరరామ్ అన్నారు. సమితి అనుబంధ సంస్థల నిర్వాహకులతో ఏకేసీ రోటరీ హాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. సమితి ప్రధాన కార్యదర్శి సీపీ.రెడ్డి మాట్లాడుతూ డీమ్డ్ యూనివర్శిటీగా తీర్చిదిద్దేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ అధ్యక్షుడు మద్దూరి శివ సుబ్బారావు, జూనియర్ కళాశాల అధ్యక్షుడు జెట్టి ప్రసాదరావు, డాక్టర్ కర్రి రామారెడ్డి, డాక్టర్ కె.అనూరాధ, శ్రీనివాస్, సీహెచ్ ప్రభాకర్,జమ్మి సోదరులు, ప్రచార కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిలీ జయంతి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం జరిపారు. కళాశాల విభిన్న ప్రతిభావంతులు, డిఫరెంట్లీ ఏబుల్ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిం చారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లా డుతూ అంధులకు చూపునిచ్చిన మహనీ యుడు బ్రెయిలీ అన్నారు. భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం భౌతికశాస్త్ర పితామహుడు సర్ ఐజాక్ న్యూటన్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్నీసుపేట యూనియన్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ ఆనందరావు, ఫిజిక్స్ విద్యార్థిని రమాబాను, కమిటీ కన్వీనర్ శ్రీరామ్మూర్తి, భౌతికశాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతిని రాజమహేంద్రవరం గణేష్‌చౌక్‌లోని బీసీ కళాశాల బాలికల వసతిగృహంలో శనివారం నిర్వహించారు. జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు జిల్లా బీసీ సంక్షేమాధికారిణి శశాంక, ఏబీసీడబ్ల్యువో ముత్యాల సుబ్బారావు నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా హెచ్‌డబ్ల్యువోలు సౌజన్య, కేజీ కాత్యాయిని, కె.సుందరమ్మ, పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

లూయిా బ్రెయిల్ జయంతి

రంగంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంధులకు లూయిస్ బ్రెయిలీ అక్షరశిల్పి అని రంగంపేట మండల ఎంఈవో కె.శ్రీనివాసరావు అన్నారు. శనివారం రంగంపేట రాజగోపాలపురం ఎంపీపీ స్కూల్‌లోని భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని జరిపారు. ఆయన మాట్లాడుతూ బ్రెయిలీని స్మరించుకోవడం అదృష్టమని అన్నారు. అనంతరం ఎంఈవో కేక్ కోసి విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.సూర్యకృష్ణ, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ సత్య, ఐఆర్‌టీలు ప్రసాద్, అంజలి పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 5 జనవరి 2025 | 1





నువ్వే మా గేమ్ చేంజర్ : బాబాయ్ పవన్‌ను హత్తుకున్న రామ్‌చరణ్

గేమ్ చేంజర్ షో

డిప్యూటీ సీఎం పవన్.. మెగా హీరో రామ్‌చరణ్.. దర్శకుడు శంకర్ ఇలా అతిరథ మహారథులందరూ వస్తుంటే.. అభిమానం ఊరుకుంటుందా.. ఎగసిపడింది.. ఉవ్వెత్తున ఉరకలేసింది.. తమ అభిమాన నటీనటులను నేరుగా చూడాలని ఎక్కడెక్కడి నుంచో తరలిరావడంతో వేమగిరి జనసంద్రమైంది.. ఇసుకేసినా రాలనంత జనం.. ఎక్కడి నుంచి వచ్చారో కానీ శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచే జాతీయ రహదారి యువతతో నిండిపోయింది.. సాయంత్రం ఐదు గంటలయ్యే సరికి కిక్కిరిసిపోయింది.. అభిమానులను అదుపుచేయడం ఎవరితరం కాలేదు..వీవీఐపీ.. వీఐపీ పాస్‌లు పనిచేయలేదు.. అయినా అభిమానులు కదల్లేదు.. జై పవన్.. జై రామ్‌చరణ్ అంటూ ముందుకు కదిలారు..గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను విజయవంతం చేశారు. - లోపల పేజీలో



వేదికపై మాట్లాడుతున్న పవన్ చిత్రంలో శంకర్, సూర్య, దిల్ రాజు



స్టేజీపై యాంకరింగ్ చేస్తున్న అంజలి, సుమ



అభిమాన దండ...



మాట్లాడుతున్న దర్శకుడు శంకర్



అభిమాన సంద్రం : వేమగిరిలో కిక్కిరిసిన గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్రాంగణం



మధ్యాహ్నం స్టేజ్ వద్ద కిక్కిరిసిన అభిమానులు



నిడదవోలులో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదు

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

నిడదవోలులో మంత్రి దుర్గేష్

నిడదవోలు,జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం ప్రవేశ పెట్టిందన్నారు.డిజిటల్ విద్యా విధా నంలో భాగంగానే సంకల్ప్ 2025కు శ్రీకారం చుట్టిందన్నారు.పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు మానకూడదనే సదుద్దేశంతో సీఎం చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టిందన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యపై దృష్టి పెట్టిందన్నారు. చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ పేరున పథకం అమలు చేయడం శుభసూచకమన్నారు.అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించి.. మంత్రి,కలెక్టర్ తదితరులంతా వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రాణి సుస్మిత, డీఈవో కె.వాసుదేవ రావు,జిల్లా ఒకేషనల్ అధికారి సుబ్రహ్మణ్యం,డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 5న కాకినాడలో జరిగే స్వర్ణోత్సవాలను విజయవంతం చేద్దామని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. జయకర్,ఎ.షరీఫ్ పిలుపునిచ్చారు.రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.కాకినాడ పీఆర్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగే స్వర్ణోత్సవాల్లో 20 వేల మంది ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.విజయగౌరి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్‌రావు,కార్యదర్శులు ఎన్.రవిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సైన్స్ ప్రదర్శనలతో మేధస్సుకు పదును

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల్లో ఇమిడి ఉన్న మేధస్సుకు పదునుపెడతాయని, జిల్లా కలెక్టర్ ప్రశాంతి పిలుపునిచ్చారు. రూరల్ మండల పరిధి బొమ్మూరులో గల శ్రీ సత్య సాయి గురుకుల పాఠశాలలో శనివారం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన- సౌతిండియా సైన్స్ ఫెస్ట్‌ను ప్రారంభించి మాట్లాడారు. సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. మాతృభాషపై పట్టు సాధించేందుకు విద్యార్థులు కృషిచేయాలన్నారు. ఇంగ్లీషు మీడియం ఒక వారధి మాత్రమే అన్నారు.రాజమ హేంద్రవరం రూరల్, అనపర్తి ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విద్యార్థులు పోటీతత్వంతో ప్రాజెక్టులు చేయాలన్నారు. ప్రతి మండలం నుంచి మూడు ప్రదర్శనలు జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్టు డీఈవో వాసుదేవరావు తెలిపారు. మొత్తం 19 బృందాలు ప్రదర్శన ఏర్పాటు చేశాయన్నారు.అటల్ టింకరింగ్ ల్యాబ్స్ నుంచి 30 ప్రాజెక్టులు ఎంపిక చేసినట్టు తెలిపారు. మొత్తం 500 ప్రదర్శనలు ఏర్పాటు చేయగా 800 మంది భాగస్వామ్యంతో పోటీపడినట్టు తెలిపారు. వీటిలో అత్యుత్తమ వాటిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి,జిల్లా సైన్సు అధికారి జీవీఎస్ ఎస్.నెహ్రూ, రూరల్ ఎంఈవో దుర్గా తులసీదాస్, సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ శ్యామ్‌సుందర్, ప్రిన్సిపాల్ గురవయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



షిర్డీ సాయి విద్యానికేతన్‌లో ముగ్గులు..తిలకిస్తున్న ఎమ్మెల్యే, న్యాయనిర్ణేతలు తదితరులు



నాకూ వచ్చు : ముగ్గు వేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ముగ్గులోలికే!

ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి ముగ్గుల పండుగ

- ముగ్గుల పోటీకి విశేష స్పందన
- పెద్ద ఎత్తున మహిళల హాజరు
- ఆలోచింపజేసిన ముగ్గులు
- ముందే వచ్చిన సంక్రాంతి



వెల్‌కమ్ మేడమ్ : కలెక్టర్ ప్రశాంతికి జ్ఞాపిక అందజేస్తున్న షిరిడిసాయి స్కూల్ చైర్మన్ శ్రీధర్, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్



ప్రథమ బహుమతి విజేత అమ్మాజీకి నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు, బీఎం శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముందే వచ్చేసింది.. మహిళల్లో ఉత్సాహాన్ని నింపింది.ఆకాశంలో చుక్కల్లా భువిపై చుక్కలు అందంగా వెలిశాయి..ఆకట్టుకున్నాయి. రాజమహేంద్రవరం ఆల్ బ్యాంక్ కాలనీ షిరిడి సాయి విద్యానికేతన్ గ్రౌండ్స్‌లో శనివారం సంతూర్, సెల్సియా,క్రాప్‌వారి పర్‌ఫెక్ట్ సహకారంతో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి ముగ్గు వేసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ముగ్గులు మన సంస్కృతి సాంప్రదాయంలో ఒక భాగం..అటువంటి సాంప్రదాయాన్ని గౌరవించి ప్రతి ఏటా మహిళలను ప్రోత్సహించడానికి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పండగ పూట మహిళలు ఆనందం ఉండాలని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గులు పోటీలు నిర్వహిస్తుందన్నారు. 'ఆంధ్రజ్యోతి' స్ఫూర్తితో తాము నగరంలో ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.ఆంధ్రజ్యోతి ఎండీ రాధా కృష్ణ పది మందికి ఉపయోగాడే కార్యక్రమాలు చేస్తారని చెప్పారు. 80 సెంటర్లలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ప్రముఖ హాస్యనటుడు భద్రం మాట్లాడుతూ ప్రతి ఏట ఈ సంప్రదాయాలను 'ఆంధ్రజ్యోతి' కొనసాగించడం చాలా సంతోషదాయకమన్నారు. 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీల విజేతల్లో ఒకరు విజయవాడలో జరిగే ఫైనల్స్‌లో పాల్గొంటారని చెప్పారు. శనివారం తూర్పు గోదావరి, కోనసీమలో ముగ్గుల పోటీలు నిర్వహిం చామని..ఆదివారం కాకినాడలో నిర్వహి స్తామని తెలిపారు.ముగ్గుల పోటీ నిర్వహించేందుకు సహకరించిన షిరిడి సాయి ఛైర్మన్ టి.శ్రీధర్ డైరెక్టర్ టి.శ్రీవిద్యలకుధన్యవాదాలు తెలిపారు.ఉదయం 11 నుంచి మధ్యా హ్నం 1 గంట వరకు జరిగిన ముగ్గుల పోటీల్లో 65 మంది మహిళలు పాల్గొని అద్భుతంగా చుక్కల ముగ్గులు వేశారు. ఈ ముగ్గుల పోటీకి లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు, ఆంధ్రకేసరి యువజన సమితి ఉపాధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, రాజమండ్రి చాం బర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ కొయ్యన కుమారి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మహిళలు పెట్టిన ముగ్గులను తిలకించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి విజే తలు వరుసగా గిరి అమ్మాజీ (రావులపాలెం), తూతిక ఆదిశ్రీ(రాజమహేంద్రవరం), పి.పావని (రాజమహేంద్రవరం)లకు నగదు బహుమతి రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అందజేశారు.10 కన్సోలేషన్,పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు గిఫ్టలను అందించారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, 'ఆంధ్రజ్యోతి' డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజరు బి.గోపాలకృష్ణ, జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు ఎన్ఎన్ఎన్.సత్యనారాయణ, కె.రాజబాబు,పాత్రికేయులు డి.రామచంద్రరావు, ఎంబీవీ సారథి, బెజవాడ శంకర్, కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఫస్ట్ ప్రైజ్ రావడం ఆనందంగా ఉంది..
ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో నాకు ఫస్ట్ ప్రైజ్ రావడం ఆనందంగా ఉంది. పేపర్‌లో చూసి రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వచ్చా. ప్రతి ఏలా పోటీలు నిర్వహించాలి.
- గిరి అమ్మాజీ, ప్రథమ బహుమతి, రావులపాలెం



ముగ్గులకు విలువ తెచ్చింది 'ఆంధ్రజ్యోతి'
ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలకు ప్రతి ఏటా హాజరవుతా. ముగ్గుల ప్రాధాన్యతను పెంచింది ఏబీఎన్- ఆంధ్రజ్యోతి మాత్రమే. చిన్న తేడాతో ఫస్ట్ ప్రైజ్ పోయింది. సెకండ్ వచ్చింది అయినా బాధలేదు.**-టి.ఆదిశ్రీ, ద్వితీయ బహుమతి ,రాజమహేంద్రవరం**



బహుమతి రావడం ఆనందంగా ఉంది..
బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది. అసలు ఊహించలేదు.ఏదో నాకు వచ్చిన ముగ్గును అందంగా వేశా. వచ్చే ఏడాది ఫస్ట్ ప్రైజ్ సాధించేందుకు ఇప్పటి నుంచే ముగ్గు నేర్చుకుంటా.
-పావని, తృతీయ బహుమతి ,రాజమహేంద్రవరం

సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

కొవ్వూరులో నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

కొవ్వూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో పింఛను వెరిఫికేషన్‌లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై తహశీల్దార్ దురుసు ప్రవర్తనను జిల్లా అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం విధులకు హాజరయ్యారు. ఆత్మగౌరవంపై జరిగిన దాడికి నిరసిస్తూ వి నీడ్ రెస్పెక్ట్ అని కొవ్వూరు పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీరు కార్యాలయం వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల అర్హతను గుర్తించి కోట్ల రూపాయలతో చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో రికార్డింగ్ బాధ్యతలను అప్పగించిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ మోహనకృష్ణ, జిల్లా అధ్యక్షుడు సుధీర్, పాదిక్ అహ్మద్ (చాగల్లు మండలం), భానుప్రకాష్ (నిడదవోలు), ఫారూఖ్‌ఖాన్ (గోకవరం), జాఫర్ షరీఫ్ (కోరుకొండ), ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ట్రెజరర్ సత్యనారాయణ

నిడదవోలు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసి రిటైర్ అయిన వారికి సేవలందించడమే ట్రెజరీ అధికారులు, సిబ్బంది విధి అని జిల్లా ట్రెజరీ అధికారి ఎన్.సత్యనారాయణ అన్నారు. శనివారం నిడదవోలులోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంఘ సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. పెన్షనర్స్ అందరూ ట్రెజరీ అధికారి సమక్షంలో లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేసుకోవాలన్నారు. ట్రెజరీ కార్యాలయానికి రాలేని పెన్షనర్ల ఇళ్లకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్ తీసుకునే ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు బలగం అప్పారావు, కీర్తి ఆంజనేయులు, సబ్ ట్రెజరీ అధికారి జి.ఫణీంద్ర, నల్లి విశ్వామిత్ర, పొన్నా సుబ్రహ్మణ్యం, బొజ్జా పాపారావు, సామ్రాజ్యం, శమంతకమణి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గోపాలపురం జడ్పీ హైస్కూల్ 1971-72 బ్యాచ్ విద్యార్థులు

గోపాలపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జడ్పీ హైస్కూల్లో 1971-72 సంవత్సరంలో అప్పటి ప్రధానోపాధ్యాయుడు రాయల అప్పారావు పర్యవేక్షణలో విద్యనభ్యసించిన విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. సుమారు 50 ఏళ్ల తరువాత కలిసిన సుమారు 65 మంది విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగక్షేమాలు పంచుకున్నారు. ఆనాడు మొత్తం 150మంది విద్యార్థులతో ఏ,బీ,సీ పేరుతో మూడు సెక్షన్లుగా విద్యనభ్యసించారు. నేటికి కొందరూ కాలం చేయగా మిగిలినవారు మాత్రం ఒక వేదికపై శనివారం కలిశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన కర్లపూడి చిన్నబ్బాయి, మానుకొండ విద్యాసాగర్, ఎస్కే సికిందర్, మల్లిపూడి ఆమేస్‌రాజు, ఎస్కే.అమీర్ బాషా, ఈద్పాగంటి నాగేశ్వరరావు, పొన్నాడ గంగాధరం, వింతా సుబ్బారెడ్డి, ఏపీవో జేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మూడు తాటాకిళ్లు దగ్ధం

సుబ్బరాయపురంలో ఘటన.. రూ.5 లక్షల ఆస్తినష్టం.. బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



సుబ్బరాయపురంలో పూర్తిగా దగ్ధమైన చంద్రన్న ఇల్లు

దేవరపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయపురంలో శనివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ మూడు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రెవెన్యూ అధికారులు, బాధితుల వివరాల ప్రకారం.. చాపల చంద్రమ్మ వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వెళ్లగా చంద్రమ్మ ఇంటి నుంచి షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు సంభవించి ఆ ఇంటికి ఇరువైపులా ఉన్న మందా రామారావు, మందా నిర్మలకు చెందిన ఇళ్లకు వ్యాపించి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇంట్లోని వంట సామగ్రి, గృహోపకరణాలు, దుస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. చంద్రమ్మ ఇంట్లో రూ.40 వేలు నగదు, నాలుగు కాసుల బంగారం, మందా రామారావు, మందా నిర్మల ఇళ్లలోని గృహోపకరణాలు, కుట్టు మిషన్లు, ఆధార్‌కార్డులు మొత్తం దగ్ధమయ్యాయని వాపోయారు. మంటలను కొవ్వూరు అగ్నిమాపక అధికారి ఎండీఎం అలీబేగ్ ఆధ్వర్యంలో సిబ్బంది అదుపు చేశారు. సాయంత్రం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, టీడీపీ నాయకులు పరామర్శించి తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.3 వేలు నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సాయాన్ని అందిస్తామని, బాధిత కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండలాధ్యక్షుడు అంద్రూ అనీల్, బిక్కిన నాగరాజు, గన్నమని హరికృష్ణ, ముళ్ళపూడి దొరాజీ చౌదరి, పెనుమత్స సుబ్బరాజు ఉన్నారు.



పంచాయతీ కార్యదర్శుల సంఘ ఉండ్రాజవరం

అధ్యక్షుడిగా హసన్‌జానీ

ఉండ్రాజవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సంఘ మండలాధ్యక్షుడిగా పాలంగి గ్రామ పంచాయతీ కార్యదర్శి మహ్మద్ హసన్‌జానీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం జరిగిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జీవీవీ సత్యనారాయణ(చివటం), ఉపాధ్యక్షుడిగా వంగా శ్రీనివాసరావు(కాల్దరి), కార్యదర్శిగా చోళ్ల రాజు(చిలకపాడు), కోశాధికారిగా తిప్పాని రాజకుమార్ (వడ్లూరు), మహిళా సంయుక్త కార్యదర్శిగా తెల్లం బాలాత్రిపుర సుందరి (మోర్త)తోపాటు కార్యవర్గ స భ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.



వేలివెన్నులో పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు తదితరులు

వైకుంఠ ఏకాదశి సప్తాహ మహోత్సవం

ఉండ్రాజవరం, జనవరి 4 (ఉండ్రాజవరం) : మండలంలోని వేలివెన్ను గ్రామంలో సీతారామ చంద్రస్వామి, వేణుగోపాలస్వామివార్ల ఆలయం వద్ద వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం సప్తాహ మహోత్సవ కార్యక్రమం వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య ఘనంగా ప్రారంభించారు. వేదపండితులు డివి పట్టాభిరామశర్మ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం నగర సంకీర్తన, అఖండ నామ సంకీర్తన ప్రారంభించారు. మంత్రి కందుల దుర్గేష్, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసరావు,శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడ్డర్‌ను ఢీకొన్న బస్సు

నిడదవోలు,జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులో ఓవర్ బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలు నియంత్రించేందుకు ఐరన్ గడ్డర్‌లను ఏర్పాటు చేశారు.పట్టణంలో జరుగుతున్న ఆర్వోబీ పనులకు సంబంధించి మెటీరియల్ తెచ్చే భారీ వాహనాల కోసం ఒకవైపు గడ్డర్ తెరుచుకునేలాచేశారు.దానిని కాస్తా శనివారం నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే బస్సు ఢీకొనడంతో విరిగిపోయింది.

పేదల విద్యాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



కొవ్వూరులో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పేదల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19 కాలంలో సీఎం చంద్రబాబు జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్‌ప్రభుత్వం ఆ పథకాన్ని నిలుపుదల చేసింది. ఇటీవల కూటమి అధికారంలోకి రావడంతో డొక్కా సీతమ్మ పేరుతో ఈ పథకాన్ని శనివారం రాష్ట్ర వ్యా ప్తంగా ప్రారంభించిందన్నారు. సీఎం చంద్రబాబు పేద విద్యార్థుల విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. జూనియర్ కళాశాలల్లో ఖాళీ గా ఉన్న పీడీ నైట్ వాచ్‌మేన్ పోస్టులను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని బాలుర కళాశాల ప్రిన్సిపాల్ జి.సతీష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, కౌన్సిలర్ పాలూరి నీలిమ, పెనుమాక జయరాజు, మద్దిపాటి మురళీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రిన్సిపాల్ పి.పావని మాట్లాడుతూ ఈ పథకం వల్ల సుమారు రెండు వందల మందికి పైగా ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాదెళ్ల శ్రీరామ్, కరుటూరి సతీష్, బొల్లిన శివనాగేంద్ర, దొంగ రామకృష్ణ, తాళ్ళూరి వరప్రసాద్, కె.సుబ్బారావు, మిరియాల సతీష్, తహశీల్దార్ ఎం.మెరికమ్మ పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల హైస్కూల్ ప్లస్ 2(జూనియన్ కళాశాల) విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. ఎంఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం తయారు చేసి విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కోడూరి నారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, వల్లూరి సత్తిపండు, గుదె సుబ్బారావు, ఆలపాటి రామకృష్ణ, కూచిపూడి భాస్కరావు పాల్గొన్నారు.

దేవరపల్లి: యర్నగూడెంలో జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా,ధృడంగా ఉండాలంటే పౌష్టికాహారం ఇవ్వాలని, దాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు అంద్రూ అనీల్, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గద్దే శ్రీనివాస్, నాయకులు బొల్లి భాస్కర్, పెనుమత్స సుబ్బరాజు, గన్నమని హరికృష్ణ, ఎంఈవోలు తిరుమలదాసు, అప్పారావు, ప్రిన్సిపాల్ శివాజీ పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా టీడీపీ నాయకుడు కైగాల శ్రీనివాస్ విచ్చేశారు. కళాశాల విద్యార్థులు భోజనం చేసేందుకు గాను పూర్వ విద్యార్థులు సమకూర్చిన కంచాలు, గ్లాసులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పరస రాధాకృష్ణ, ఇందుగుల రామకృష్ణ, ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాస్, ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ పాల్గొన్నారు.



వేగేశ్వరపురంలో విద్యార్థులకు కంచాలు అందిస్తున్న దృశ్యం



చాగల్లు కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పావని



నల్లజర్లలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న దృశ్యం



యర్నగూడెం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

అదనపు టోల్ ఫీజు రద్దుచేయాలి

- కొవ్వూరు గామన్ బ్రిడ్జి వద్ద లారీ అసోసియేషన్ ఆందోళన
- ఎమ్మెల్యే ముప్పిడికి వినతిపత్రం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న లారీ యూనియన్ నాయకులు

కొవ్వూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణా చేసే లారీలకు అదనపులోడ్ పేరుతో వసూలు చేస్తున్న అదనపు టోల్‌ఫీజును రద్దు చేయాలని కోరుతూ లారీ అసోసియేషన్ నాయకులు ఆందోళన చేపట్టారు. శనివారం కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌గేటు వద్ద సిబ్బందికి లారీ డ్రైవర్‌కు మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. దీంతో పంగిడి లారీ అసోసియేషన్, కొవ్వూరు, ఔరంగాబాద్, వాడపల్లి బోట్స్‌మేన్ సొసైటీల నాయకులు గామన్‌బ్రిడ్జి టోల్‌గేటు కాటా వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సం ఘటనా స్థలానికి చేరుకున్నా రు. లారీ అసోసియేషన్ నా యకులు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉచి త ఇసుక పాలసీని అమలు చేస్తోందన్నారు. ట్యాక్స్, జీఎస్టీ తొలగించి బోట్స్‌మేన్ సొసైటీల ఆధ్వర్యంలో నదిలోకి వెళ్లి ఇసుక తవ్వి తీసుకువచ్చే కార్మికులకు మాత్రమే చార్జీలు వసూలు చేస్తున్నట్టు చెప్పారు. అదనపు టోల్‌ఫీజు వసూలు రద్దుపై సంబంధిత అధికారులు, మం త్రులతో ఫోన్‌లో మాట్లాడారు. అయితే జీవో ప్రకారమే టోల్‌ఫీజు వసూలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. స్థానిక లారీలకు ఓవర్‌లోడ్ చార్జీల రద్దుకు కృషి చేస్తానని, ఆం దోళన చేపట్టవద్దని లారీ అసోసియేషన్ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. ఆర్‌డీసీ ఈఈ వైర వీంద్ర మాట్లాడుతూ ఇసుక లారీల్లో ఓవర్‌లోడ్‌కు అదనపు టోల్‌ఫీజు వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కంఠమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, లారీ అసోసియేషన్ నాయకులు చౌటిపల్లి శివ, పాకా జయరామ్, దేగల రాము, చిన్నా, సత్తిబాబు, పంగిడి లారీ అసోసియేషన్, కొవ్వూరు, ఔరంగాబాద్, వాడపల్లి బోట్స్‌మేన్ సొసైటీల నాయకులు పాల్గొన్నారు.

రేషన్‌షాపు డీలర్‌షిప్‌నకు

దరఖాస్తుల స్వీకరణ

తాళ్లపూడి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో రేషన్‌షాపు డీలర్‌షిప్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తహశీల్దార్ బీరా రవీంద్రనాథ్ తెలిపారు. ఇంటర్మీడియేట్ పాసైన 18నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులని, ఏ గ్రామంలోని వారు ఆ గ్రామంలోని షాపులకు మాత్రమే దరఖాస్తులు అందించాలని, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు ఏ గ్రామంలో నివసిస్తున్నా మండలంలో ఎక్కడైనా దరఖాస్తులు పెట్టుకోవచ్చని తెలిపారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఇంటర్ మార్కులిస్ట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలతో పాటు నిరుద్యోగిగా, ఆర్థిక స్థోమత ఉన్నట్టు అఫిడవిట్ దరఖాస్తుకు జత చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఇవ్వాలని చెప్పారు.

రెవెన్యూ సదస్సులు

కొవ్వూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ అన్నారు. కొవ్వూరు మండలం మద్దూరు గ్రామంలో శనివారం సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్(బాబ్జి) ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ బి.విశ్వేశ్వరరావు, ఏఎస్‌ఐ జె.ధర్మరాజు, వీఆర్వో జగ్జీవన్‌రావు,సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో పల్లెలకు మహర్దశ

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- గోపాలపురంలో రూ.1.20కోట్లతో పూర్తి చేసిన పలు నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు



గోపాలపురంలో స్కూల్ ప్రహరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిలో పల్లెలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇటీవల మండలంలో రూ.1.20 కోట్లతో రేగులగుంట, నందిగూడెం, కొవ్వూరుపాడు, గోపాలపురం, వాదాలకుంట, భీమోలు గ్రామాల్లో చేపట్టి పూర్తి చేసిన నిర్మాణాలను, సంజీవపురంలో గిరిజన ఫంక్షన్‌హాలును ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం గోపాలపురంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డొక్కా సీతామ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి సమపాళ్లలో దూసుకెళ్తున్నాయని అన్నారు. పెంచిన పింఛన్‌ను ఒక రోజు ముందుగానే ఇవ్వడంతో పాటు వైసీపీ ప్రభుత్వంలో శిథిలమైన రోడ్లను కూటమి అధికారంలోకి వచ్చాక నిర్మాణాలు చేపడుతోందన్నారు. అలాగే గత ప్రభుత్వంలో పక్కనపెట్టిన గోపాలపురం-2, తొక్కిరెడ్డిగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.30 లక్షలతో మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అజయ్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ వెంకటలక్ష్మి, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ కాకులపాటి లలిత, టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, వడ్లమూడి రమేష్, కొర్లపాటి రాము, జ్యేష్ట శ్రీనివాసరావు, జ్యేష్ట శ్రీధర్, పంచాయతీరాజ్ ఏఈ పవన్‌కుమార్, ఏపీఎం రోజ్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బాలికల చట్టాలపై అవగాహన అవసరం

- ఐసీడీఎస్ పీడీ విజయకుమారి
- కిషోర బాలికల వికాసంపై శిక్షణ



గర్భిణులకు ఆకుకూరలు అందజేస్తున్న పీడీ విజయకుమారి

దేవరపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బాలికల చట్టాలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి అన్నారు. దేవరపల్లిలో బీహెచ్‌ఎస్‌ఆర్ ఆర్‌వీఎల్ఎం డిగ్రీ కాలేజీలో శనివారం కిషోర బాలికల వికాసం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ విజయకుమారి మాట్లాడుతూ బాలికల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలికలపై లైగింక వేధింపులు, బాలికల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకుకూరలు, కాయగూరలను తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడ డ్రింకింగ్ వాటర్‌ను, టాయి లెట్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీ డీవో ఎస్.గోపాలరెడ్డి, తహశీల్దార్ రాజ్యలక్ష్మి, విద్యా శాఖాధికారులు తిరుమలదాసు, అప్పారావు, డీపీవో పద్మావతి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య, డ్వాక్రా సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఒక్కరోజు శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుశీల మాట్లాడుతూ మహిళలు చదువుకుంటే ఆ కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మహిళలు చదువుకుంటే ఆ కుటుంబం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ ప్రీస్కూల్ ఆవశ్యకత, డీసీపీవో కార్యాలయ అధికారి క్రాంతి ట్రాఫికింగ్, అడాప్షన్, బాల్య వివాహాల నిర్మూలన, న్యాయవాది పీవీపీ లక్ష్మి కిశోర బాలికల చట్టాలు, హెల్త్ ఎడ్యుకేటర్ టి.సత్యవతి, రమేష్‌బాబు ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రలమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కేవీ పద్మిని, ఆదిలక్ష్మి, డీసీపీవో రాజ్ కుమార్, దేవరపల్లి ఎన్‌జీవోలు నిర్మల, ఎం.జాన్ ఇస్రాయిల్, లెక్చరర్ ఉదయశ్రీ పాల్గొన్నారు.

నర్సరీ విద్యార్థిపై దాష్టీకం

విచక్షణారహితంగా కొట్టిన ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిపైతలిదండ్రుల ఫిర్యాదు

పెరవలి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఐదేళ్ల బాలుడ్ని ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు విచక్షణ కోల్పోయి విపరీతంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నిడదవోలు రూరల్ మండలం కోరుపల్లికి చెందిన చేబ్రోలు అనిల్‌కుమార్ కుమారుడు దినేష్ శ్రీమణి (5) పెరవలి మండలం కానూరులోని రమాబాయిశ్రీ స్కూలులో నర్సరీ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 3న పాఠశాలకు వెళ్లిన శ్రీమణి స్కూలు వద్ద బస్సు దిగనని మారాం చేయడంతో స్కూలు నిర్వాహకుడైన అశోక్ విచక్షణ కోల్పోయి విపరీతంగా కొట్టాడని, దీంతో శ్రీమణి తీవ్రంగా గాయపడ్డాడని తండ్రి అనిల్‌కుమార్ ఆరోపించాడు. దీంతో తమ తల్లి స్కూలుకు వెళ్లి ప్రశ్నించగా స్కూలు యాజమాన్యం దురుసుగా సమాధానం చెప్పడంతో పాటు మీకు చేతనైన పని చేసుకోమని నిర్లక్ష్య ధోరణితో మాట్లాడారని వాపోయారు. పెరవలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందజేసి వారి సలహా మేరకు తణుకు ఆసుపత్రిలో చికిత్స చేయించామన్నారు. పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.





ఏడుస్తున్న విద్యార్థి శ్రీమణి, వీపుపై కొట్టిన దెబ్బలు